క్లుప్తంగా

ఖాదర్‌లింగస్వామి దర్గాలో భక్తుల సందడి



ఫాతెహాలు సమర్పిస్తున్న భక్తులు

కౌతాళం: మండల కేంద్రంలో వెలసిన జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు అధికంగా తరలివచ్చి స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల రాకతో దర్గా పరిసరాలు నిండిపోయాయి. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్టీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్టీ స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. కొందరు భక్తులు పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

రాజనగర్‌లో వనభోజనాలు



ఉసిరి చెట్టుకు పూజలు చేస్తున్న మహిళలు

కౌతాళం: మండల కేంద్రంశివారులోనున్న రాజనగర్ క్యాంపులో గురువారం కార్తీక వన భోజనాలు చేపట్టారు. ముందుగా ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలు చేపట్టి అనంతరం సహపంక్తి వనభోజనాలు చేశారు. నిర్వాహకులు సుబ్బారాజు, వెంకటపతిరాజు, గణపతిరాజు మాట్లాడుతూ తమ క్యాంపులో ఏటా వనభోనాలు నిర్వహిస్తామని, ఇందులో భాగంగా ఈ ఏడాది కూడా నిర్వహించినట్లు చెప్పారు. నాలుగు దశాబ్దాలుగా కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు.

ఉచిత గ్యాస్ కనెక్షన్‌ల పంపిణీ



మహిళలకు గ్యాస్ కనెక్షన్‌లను అందజేస్తున్న దృశ్యం

ఆదోనిరూరల్: వైఎస్సార్‌సీపీ యువనేత జయ మనోజ్‌రెడ్డి సహకారంతో 20 మంది మహిళలకు గురువారం ఉచిత గ్యాస్ కనెక్షన్లను అందజేశారని 24వ వార్డు కార్వన్‌పేట ఇన్‌చార్జ్ వై.పి.కృష్ణమోహన్ తెలిపారు. కార్యక్రమంలో టైలర్ షాషా, రవి, వై.పి.హుసేని, వలీ, రియాజ్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఆదోనిటౌన్: పట్టణంలోని 41,42 వార్డుల పరిధిలోని సచివాలయాల్లో గురువారం స్పందన కార్యక్రమం మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో హనుమాన్‌నగర్, షరాఫ్‌బజార్‌లోని సచివాలయం–3 పరిధిలో నివాసముంటున్న వారు కార్యక్రమానికి హాజరై తమ సమస్యలను వివరించి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో 20 మంది వినతి పత్రాలు అందజేశారు. ఇంటి పట్టా కోసం ఐదుగురు, తాగునీటి సరఫరా సక్రమంగా చేయాలని నలుగురు, రోడ్ల నిర్మాణాలు చేపట్టాలని ఐదుగురు, వీధిలైట్లు ఏర్పాటు చేయాలని ఇద్దరు, మురుగు కాలువల సమస్యను పరిష్కరించాలని నలుగురు విన్నవించారు. నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరిస్తామని కమిషనర్ తెలిపారు. కౌన్సిలర్లు లోకేశ్వరి, నాగరాజ్, టీపీఓ శ్రీనివాసులు, ఏఈలు, డీఈలు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల్లో పురోగతి సాధించాలి

నందవరం: జగనన్న కాలనీలో గృహ నిర్మాణాల్లో పురోగతి సాధించాలని హౌసింగ్ సిబ్బందికి, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు ఎంపీడీఓ దశరథరామయ్య, హౌసింగ్ డీఈఈ ప్రసాద్ సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో హౌసింగ్ సిబ్బంది, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. జగనన్న కాలనీలో వివిధ దశలో ఉన్న ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలన్నారు. థర్డ్ పార్టీలో ఇళ్ల నిర్మాణాలు కూడా జనవరి 15 లోపు పూర్తి చేయాలని సూచించారు. ఇళ్ల నిర్మాణాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించి త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. బిల్లులు కూడా సకాలంలో చెల్లిస్తామన్నారు. హౌసింగ్ అధికారులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అర్జీలకు సత్వర పరిష్కారం

చిప్పగిరి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్నకు చెబుదాం–స్పందన కార్యక్రమానికి మండలంలోని డేగులహాలు గ్రామంలో విశేష స్పందన లభించింది. గురువారం డేగులహాలు గ్రామ సచివాలయంలో ఎంపీడీఓ సీపీ కొండయ్య ఆధ్వర్యంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వినతులు పరిశీలించి తగిన పరిష్కారం చూపుతామని ఎంపీపీఓ తెలిపారు. ఈఓఆర్డీ బాలన్న, ఏపీఎం నాగార్జున, ఏఈ భవ్య, పంచాయతీ కార్యదర్శి నరసింహులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథిని ఆదరిద్దాం



ఆదోని 4వ వార్డులో అభివృద్ధి పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించిన దృశ్యం,



17వ వార్డులో మహిళకు బ్రోచర్ అందజేస్తున్న నాయకులు



చూడిలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆదోనిటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తోనే సంక్షేమ పథకాలు, రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, మళ్లీ ఆయననే సీఎంగా గెలిపించుకుందామని మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు దేవా, కన్వీనర్లు మధుసూదన్‌శర్మ, ఫయాజ్‌అహ్మద్ పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని 4వ వార్డు ఎన్‌జీవోస్ కాలనీ, 17వ వార్డు బండిమెట్ట, ఇందిరానగర్ ప్రాంతాల్లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని వేర్వేరుగా నిర్వహించారు. 4వ వార్డులో బోయశాంత, దేవా, ఫయాజ్‌అహ్మద్, 17వ వార్డులో కౌన్సిలర్ చిన్నా, కన్వీనర్ మధుసూదన్‌శర్మ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అభివృద్ధి ఫలాల డిస్‌ప్లే బోర్డును ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరించారు. అన్ని వర్గాల ప్రజలకు మేలు చేస్తున్న జగనన్న ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించుకుందామని కోరారు. కౌన్సిలర్‌లు, నాయకులు చలపతి, నరసింహులు, ఆనంద్, మహేశ్వరి, ఫర్హాద్‌భాను, గౌసియా, కొండయ్య, ఈరన్న, చెన్నబసప్ప పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు

కౌతాళం: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగనన్నకే దక్కుతుందని చూడి గ్రామ సర్పంచ్ లక్ష్మి, మండల సచివాలయాల కన్వీనర్ వెంకటరామిరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని చూడి గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంను ఎంపీడీఓ సుబ్బారాజు అధ్యక్షతన నిర్వహించారు. గ్రామ ప్రధాన కూడలి వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మారెమ్మ దేవాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో వారు మాట్లాడారు. నాయకులు ఉప్పలప్ప, ఉచ్చన్న, రమేష్, బసవరాజ్‌గౌడ్, విరూపాక్షగౌడ్, లింగన్న, అంపయ్య, గోవిందు, నాగరాజు, కార్యదర్శి మంజునాథ్ పాల్గొన్నారు.

కౌతాళం: గ్రామాల అభివృద్ధి కోసమే మరోసారి ఆంధ్రప్రదేశ్‌కు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా కావాలని కరణి సర్పంచ్ పుష్పలత, మండల సచివాలయాల కన్వీనర్ వెంకటరామిరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కరణి గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. రాత్రి గ్రామ ప్రధాన కూడలి వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గ్రామ ఇన్‌చార్జి గోవిందు, వలంటీర్లు పాల్గొన్నారు.



కరణిలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం

పేదలందరికీ పథకాలు..

కోసిగి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగున్నరేళ్లలో పేదలందరికీ పథకాలు అందజేశారని జేసీఎస్ మండల కన్వీనర్ పి. మురళీ మోహన్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని జంపాపురం గ్రామ సచివాలయం పరిధిలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బెట్టన గౌడ ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం చేపట్టారు. ముందుగా ఐరన్‌గల్లు గ్రామంలో సర్పంచ్ రామాంజనేయులు, జంపాపురంలో సర్పంచ్ హారోన్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ జెండాలను ఆవిస్కరించారు. జంపాపురంలో పార్టీ జెండాలతో సచివాలయ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. కార్యాలయంలో సంక్షేమ పథకాల డిస్ ప్లే బోర్డును ప్రారంభించారు. అనంతరం వలంటీర్లకు అవగాహన కల్పించి బుక్‌లెట్లు పంపిణీ చేశారు. ఎంపీపీ ఈరన్న, ఆర్లబండ సహకార సంఘం అధ్యక్షుడు నాడుగేని నరసింహులు, బసిరెడ్డి. ఉరుకుంద ట్రస్ట్ బోర్డు మెంబర్ బుళ్లి నరసింహులు పాల్గొన్నారు.



జంపాపురంలో పార్టీ జెండాను ఎగురవేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

దుస్తుల పంపిణీ

ఆదోనిఅర్బన్: కర్ణాటక రాష్ట్రం ముగల్‌కోడ్ జిడిగ పీఠాధిపతి డాక్టర్ మురగారస్వామి పుట్టిన రోజు సందర్భంగా జంగమ సంఘం నాయకులు గురువారం పట్టణంలో వేడుకలు నిర్వహించి అనాథలకు బట్టలు పంపిణీ చేసి, అన్నదానం చేశారు. ఈనెల 2వ తేదీన జడగ గ్రామంలో సిద్ధశ్రీ ఆశ్రమంలో రక్తదానం నిర్వహిస్తున్నట్లు సంఘం నాయకులు అమరస్వామి, చంద్రశేఖర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి తెలిపారు.

అనుమతి లేకుండా లేఅవుట్లు వేయొద్దు

కౌతాళం: అనుమతి లేకుండా లేఅవుట్స్ వేయకుడదని కౌతాళం సర్పంచ్ పాల్‌దినకర్, కార్యదర్శి చెన్నయ్య తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ లేఅవుట్లు వేయాలన్నా, భవనాల నిర్మాణాలకు పంచాయతీ అనుమతి తప్పనిసరన్నారు. నిబంధనల ప్రకారం పంచాయతీ అనుమతితోనే నిర్మాణాలు చేపట్టాలని, అనుమతి లేకపోతే సౌకర్యాల కల్పనకు పంచాయతీ బాధ్యత వహించదని పేర్కొన్నారు. ప్రజలు గమనించాలని కోరారు.

3న ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలు

ఆదోని సెంట్రల్: డిసెంబర్ 3వ తేదీన ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలు జరుగుతాయని ఎంఈఓ బి. శివరాములు గురువారం తెలిపారు. మండలంలో పరీక్షలకు 11 కేంద్రాలను ఏర్పాటు చేశామని, దాదపు 2,480 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని చెప్పారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఆయా పాఠశాలలకు చెందిన హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యేలా చూడాలని కోరారు.

పట్టాల పంపిణీ



పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి

మంత్రాలయం : మండలంలోని వివిధ గ్రామాల్లో అసైన్డ్ భూములకు సంబధించిన 25 మంది రైతులకు ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి పట్టాలు పంపిణీ చేశారు. గురువారం మండలంలోని రాంపురం గ్రామంలోని ఎమ్మెల్యే స్వగృహంలో తహసీల్దార్ చంద్రశేఖర్ సమక్షంలో రైతులకు పట్టాలు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల అభివృద్ధి ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. పార్టీ మండల ఇన్‌చార్జ్ విశ్వనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తప్పులు లేని ఓటరు జాబితాను తయారు చేస్తున్నాం



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

ఆదోనిరూరల్: తప్పులు లేని ఓటరు జాబితాను తయారు చేస్తున్నామని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ తెలిపారు. గురువారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ముసాయిదా ఓటర్‌ల జాబితాను పరిశీలించి, అందులో ఏవైనా తప్పులు, పొరపాట్లు జరిగి ఉంటే సంబంధిత ఈఆర్వో, ఏఈఆర్‌ఓ, బీఎల్‌ఓ లేదా ఆదోని ఎన్నికల అధికారికి సంబంధిత ఫారంలో ఈనెల 9వ తేదీలోపు అందజేయాలని సూచించారు. అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ ఓటు హక్కు ఉండాలన్నారు. చనిపోయినా లేదా శాశ్వతంగా వేరే ప్రదేశానికి మారిన వారి ఓట్లు తొలగించడానికి ప్రత్యేక ఫారాలను విడివిడిగా ఇవ్వాలన్నారు. సవరణలన్నీ పూర్తయిన తర్వాత ఎలాంటి తప్పులకు ఆస్కారం లేకుండా జనవరి 5వ తేదీన తుది ఓటర్ల జాబితా ప్రచురిస్తామని చెప్పారు. ఫొటో సిమ్లారీ ఎంట్రీస్, డెమో గ్రాఫికల్లీ ఎంట్రీస్ సంబంధించి ప్రత్యేక శ్రద్ధ చూపాలని సిబ్బందిని సూచించారు. ఒకే ఫోటో ఇద్దరు వ్యక్తులపై నమోదైనప్పుడు వాటిని ప్రాథమిక విచారణ జరిపి సమస్యను పరిష్కరించాలన్నారు. డెమోగ్రాఫికల్లీ ఎంట్రీ సంబంధించి ఒక ఓటర్ రెండు చోట్ల ఓటు హక్కు కలిగి ఉంటే వారికి నోటీసు పంపి వారు ఏ చిరునామాకు సంబధించిన ఓటుహక్కును వినియోగించుకుంటారో వివరాలు తీసుకొని ఎక్కడో ఒక దగ్గర మాత్రమే ఓటు వినియోగించినట్లుగా చర్యలు తీసుకోవాలని ఏఆర్‌ఓలను ఆదేశించారు. ఈనెల 2, 3వ తేదీల్లో స్పెషల్ క్యాంపెయినింగ్‌లో భాగంగా బూత్ లెవెల్ ఆఫీసర్‌లు నూతన ఓటర్ల నమోదు, చిరునామా మార్పులు, పేర్లకు సంబంధించి సవరణలు చేపడతారన్నారు. తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఉప తహసీల్దార్ (ఎలక్షన్) ఇజాజ్‌అహ్మద్, డీఎల్‌పీఓ కార్యాలయపు పరిపాలనాధికారి వీరభద్రప్ప, ఎంపీడీఓ కార్యాలయపు పరిపాలనాధికారి విజయశేఖరరావు, వైఎస్సార్‌సీపీ నుంచి ప్రసాద్, టీడీపీ నుంచి బుగ్గారెడ్డి, జనసేన తరపున తాహెర్‌వలీ, బీజేపీ తరపున నాగరాజు, బీఎస్‌పీ తరపున శాంతరాజు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్పెషల్ సమ్మరీ రివిజన్–2024లో భాగంగా ఆదోని నియోజకవర్గంలోని పలు పోలింగ్ కేంద్రాలను ఎన్నికల అధికారి, సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్ గురువారం తనిఖీ చేశారు. పట్టణంలోని పాత టీజీఎల్ పాలిటెక్నిక్ కళాశాల, నిజాముద్దీన్ కాలనీలోని మసూదియా ఉర్దూ పాఠశాల పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి పోలింగ్ కేంద్రంలో ఉండాల్సిన వసతులు తాగునీరు, టాయిలెట్స్, విద్యుత్, రాంప్ తదితర సదుపాయాలు ఉండేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఏఈఆర్‌ఓ, తహసీల్దార్ వెంకటలక్ష్మి, సూపర్‌వైజర్, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

న్యాయవాద వృత్తిలో రాణించాలి



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి దివ్య

పత్తికొండ రూరల్: న్యాయవాద వృత్తిలో రాణిస్తూ కక్షిదారులకు అంకిత భావంతో సేవలందించాలని పత్తికొండ జూనియర్ సివిల్ జడ్జి దివ్య సూచించారు. గురువారం పత్తికొండ బార్ అసోసియేషన్‌లో నూతన న్యాయవాదులు ఉప్పర నాగరాజు, జూటూరు నాగభూషణం సభ్యత్వం తీసుకున్నారు. బార్ అసోషియేషన్ ప్రధాన కార్యదర్శి బి.రంగస్వామి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జడ్జి హాజరై మాట్లాడారు. గౌరవ ప్రదమైన న్యాయవాద వృత్తిలోని చట్టాల గురించి తెలుసుకుని ప్రజలకు న్యాయ సేవలను అందించాలన్నారు. ప్రతిరోజు కోర్టుకు హాజరై కేసుల గురించి అధ్యయనం చేయాలన్నారు. బార్ అసోసియేషన్ కోశాధికారి మహేష్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, ఎల్లారెడ్డి, గోపాల్ రెడ్డి, చంద్రశేఖర్‌నాయుడు, ఈరన్న, మల్లికార్జున, సత్యనారాయణ, బాలబాష తదితరులు పాల్గొన్నారు.

మహిళాభ్యున్నతికే అర్బన్ మార్కెట్లు

ఎమ్మిగనూరుటౌన్: అర్బన్ మార్కెట్ల ద్వారా పొదుపు సంఘాల మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, కమిషనర్ గంగిరెడ్డి సూచించారు. గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ సమీపంలో మెప్మా ఆధ్వర్యంలో పొదుపు సంఘాల మహిళలు తయారు చేసిన ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించాలన్న ఉద్దేశంతో ఏర్పాటు చేసిన తాత్కాలిక మార్కెట్‌ను వారు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. మహిళా సాధికారత కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. మహిళలు స్వయంశక్తితో ఎదిగేలా ఆర్థిక సహాయం అందిస్తున్నారని, డ్వాక్రా రుణాలు సైతం అందిస్తున్నారని వివరించారు. మెప్మా సీఎంఎం జయవర్ధన్, మున్సిపల్ ఏఈ శరత్, సీఓలు పుష్ప, సువర్ణ, లలిత, కరుణ మ్మ,, ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

నందవరం: మండల పరిధిలోని హాలహర్వి గ్రామంలో ఉరివేసుకుని బోయ మంజునాథ్(28) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం స్థానికులు తెలిపిన వివరాలు ఇవి.. గ్రామంలోని బోయ గోవిందు, వెంకటలక్ష్మి దంపతులకు ముగ్గురు కుమారులు. అందులో చిన్న కుమారుడు బోయ మంజునాథ్ ఎమ్మిగనూరు టౌన్‌లో బట్టల దుకాణంలో పని చేసేవాడు. అనారోగ్య పరిస్థితుల కారణంగా పెళ్లి కాకపోవడంతో మనస్థాపం చెందాడు. బుధవారం రాత్రి షాపు నుంచి ఇంటికి వచ్చి గదిలో ఉరివేసుకుని బలవన్మరణం చెందాడు. ఉదయం కుటుంబ సభ్యులు గదిలో చూడగా ఉరివేసుకుని శవంగా కనిపించాడు. మృతదేహాన్ని చూసి కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.

పురపాలక ఉపాధ్యాయులకు పదోన్నతులివ్వాలి

ఆదోని సెంట్రల్: పురపాలక ఉపాధ్యాయులకు పదోన్నతులతో పాటు బదిలీలు చేపట్టాలని ఎస్‌టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి సి.నాగరాజు కోరారు. గురువారం స్థానిక సంఘం భవనంలో సుధాకర్‌బాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండల, జిల్లా పరిషత్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు చేపట్టినట్టే తమకు కూడా పదోన్నతులు కల్పించాలన్నారు. 2019 నుంచి బదిలీలు, పదోన్నతులు చేపట్టలేదని, ఈ నెల లోనైనా షెడ్యూల్‌ను విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు లోక్యానాయక్, రమేష్‌నాయుడు, సుంకన్న, గోపాల్, రవి, వీరచంద్రయాదవ్, భీమరాజు పాల్గొన్నారు.

'ఆడుదాం-ఆంధ్ర'పై నేడు సమావేశం

కౌతాళం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఆడుదాం ఆంధ్ర టోర్నమెంట్స్–2023 కార్యక్రమంపై శుక్రవారం ప్రత్యేక సమావేశంను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుబ్బారాజు తెలిపారు. ఆయన మాట్లాడుతూ సమావేశానికి మండల స్థాయి అధికారులందరూ హాజరు కావాలని కోరారు. జిల్లా స్పోర్ట్స్ అథారిటీ కార్యాలయం నుంచి కోచ్‌లు వస్తున్నారని, పోటీల నిర్వహణపై చర్చ ఉంటుందని చెప్పారు. అలాగే మధ్యాహ్నం మండల ప్రత్యేక అధికారి అధ్యక్షతన సమీక్ష సమావేశం ఉటుందని, ఇందుకు మండలంలోని ఇంజినీరింగ్ అసిస్టెంట్లు తప్పకుండా హాజరు కావాలని సూచించారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

దేవనకొండ: బాల్యవివాహాలను అరికట్టేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఏపీజీబీ ఫీల్డ్ ఆఫీసర్, వీఓఏలు సూచించారు. ఈ మేరకు గురువారం దేవనకొండలో గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో జెండర్, మహిళలకు సంబంధించిన విషయాలు, బాల్యవివాహాలు, బాల కార్మికుల నిర్మూలనపై అవగాహన కల్పించి, జెండర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించి వారిలో చైతన్యం తేవాలని సూచించారు.

నేడు కృష్ణగిరికి ఎమ్మెల్యే రాక

కృష్ణగిరి: మత్స్య శాఖ ఆధ్వర్యంలో మండల పరిధిలోని పెనుమాడ చెరువులో చేప పిల్లలను విడుదల చేసేందుకు శుక్రవారం మధ్యాహ్నం ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి వస్తున్నట్లు ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి, మండల కన్వీనర్ ఆర్‌బీ వెంకటరాముడు తెలిపారు. అధికారులు, పార్టీ నాయకులు పాల్గొనాలని కోరారు.

తుగ్గలి: మండల పరిధిలోని శభాష్‌పురం గ్రామ పంచాయతీలో శుక్రవారం ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పర్యటించనున్నట్లు సర్పంచ్ పుష్పావతి, సచివాలయ మండల కన్వీనర్ హనుమంతు తెలిపారు. గ్రామంలో రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్, డీసీ కొండలో సీసీ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభిస్తారన్నారు. పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

నీటి సమస్యకు పరిష్కారం

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో సుంకులమ్మ దేవాలయం వద్ద రూ.21 లక్షలతో నిర్మిస్తున్న ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణానికి సర్పంచ్ మల్లికార్జున గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వీధిలో నీటి సమస్య ఉండటంతో ట్యాంకు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి దృష్టికి తీసుకెళ్లగా స్పందించి వెంటనే నిధులు మంజూరు చేయించారన్నారు. దీంతో పనులు ప్రారంభించినట్లు చెప్పారు. ఉప సర్పంచు గోపాల్, నాయ కులు దస్తగిరి గౌడు, సీతారామిరెడ్డి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

దేవనకొండ: మండల కేంద్రంలో ఈ నెల 27వ తేదీన విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ప్రమాదంలో సర్వం కోల్పోయిన రామాంజనేయులు కుటుంబ సభ్యులను ఆదుకునేందుకు దాతలు ముందుకొస్తున్నారు. శ్రీ బ్రహ్మంగారి సేవా సమితి సభ్యులు గురువారం ఆ కుటుంబానికి రూ.13 వేలు నగదు ఇచ్చి మానవత్వం చాటుకున్నారు. వెలుగు సీసీ ఎం.నరసన్న, సీఆర్‌పీఎఫ్ బత్తిన సిద్ధప్ప, బీఎస్‌ఎఫ్ ముత్యాల మధుసూదన, తదితరులు ఉన్నారు.

నాడు-నేడుతో ఉచితంగా కార్పొరేట్ వైద్యం



మహిళలతో మాట్లాడుతున్న మనోజ్‌కుమార్‌రెడ్డి

ఆదోనిటౌన్: నాడు–నేడుతో పేదలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం, ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులను సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అందిస్తున్నారని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తనయుడు, యువనేత మనోజ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మునుపెన్నడూ లేనట్లుగా పాఠశాలలను అన్ని హంగులతో ఆధునికంగా తీర్చు దిద్దుతున్నారని కొనియాడారు. పట్టణంలోని 6వ వార్డు ఎన్‌జీవోస్ కాలనీ, ఏఎస్ కళాశాల పరిధిలో వార్డు కౌన్సిలర్ సుమ, వార్డు ఇన్‌చార్జి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, మహిళా విభాగం జిల్లా కార్యదర్శి జిలేకాబీ, పట్టణాధ్యక్షుడు దేవాతో కలిసి ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలను వివరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలువురు స్థానికులు రోడ్లు, కాలువలు వేయాలని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామని వారికి హామీనిచ్చారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ హయాంలో ప్రజలకు చేసిందేమిలేదని విమర్శించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చలేని నేత చంద్రబాబేనన్నారు. ఉనికిని కాపాడేందుకు ప్రతిపక్షాలు ప్రభుత్వంపై విమర్శలు, ఆరోపణలు చేస్తున్నారని, వారి మోసపూరిత మాటలను నమ్మొద్దని ప్రజలను కోరారు. ప్రజలకు మేలు చేస్తున్న జగనన్నను మళ్లీ సీఎంగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, నాయకులు, కౌన్సిలర్లు తిమ్మప్ప, సన్ని, శ్రీనివాసులు, శ్రీనివాసరెడ్డి, తాయన్న, దినేష్, చిరంజీవి, శ్రీలక్ష్మి, మల్లిక, ప్రణీత్, అశోక్ పాల్గొన్నారు.

ఘనంగా కనకదాసు జయంతి



అగసనూరులో జయంతి వేడుకల్లో పాల్గొన్న కురుబ కులస్తులు



కనకదాసు చిత్రపటాన్ని ఊరేగిస్తున్న క్రాంతినగర్ వాసులు

కోసిగి: మండలంలోని అగసనూరు గ్రామంలో కురుబ కులస్తుల ఆరాధ్య దైవమైన భక్త కనకదాసు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురువారం గ్రామంలో భక్త కనకదాసు చిత్రపటానికి పాలాభిషేకం చేసి గ్రామం వీధుల్లో ఊరేగించారు. కులస్తులు భక్త కనకదాసు మార్గంలో నడుచుకుందామని వక్తలు పిలుపునిచ్చారు. సర్పంచ్ ఉలిగయ్య, కులస్తులు ఎంకే నాగేష్, టీకే భీమన్న, బడప్ప, నాగేంద్ర, కర్రెప్ప, శివప్ప, నాగరాజు పాల్గొన్నారు.

ఆదోనిఅర్బన్: పట్టణంలోని క్రాంతినగర్ కాలనీలో కురువ కులస్తులు కనకదాసు జయంతిని గురువారం ఘనంగా జరుపుకున్నారు. స్థానిక ప్రభాకర్ టాకీస్ పక్కనున్న శ్రీ శంభులింగేశ్వరస్వామి దేవాలయం నుంచి ఎద్దులబండిపై కనకదాసు చిత్రపటాన్ని ఉంచి క్రాంతినగర్‌లోని ఉరుకుంద ఈరన్నస్వామి కట్ట వరకు ఊరేగించారు. ఊరేగింపులో మహిళలు, చిన్నారులు కలశాలలతో ముందు నడిచారు. నిర్వాహకులు రవి, శ్రీనివాసులు, వీరేష్, రైల్వే శ్రీను, కాశీ, శంకరప్ప, జి.కె.రాజు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత



పట్టుబడిన మద్యం, నిందితులతో సెబ్ సీఐ జయరాంనాయుడు

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలో అక్రమంగా కర్ణాటక మద్యం కలిగిఉన్న వ్యక్తులను పట్టుకున్నట్లు సెబ్ సీఐ జయరాంనాయుడు పేర్కొన్నారు. గురువారం సాయంత్రం స్థానిక సెబ్ కార్యాలయం ఆవరణలో పట్టుబడిన మద్యం, నిందితులను అరెస్ట్ చూయించారు. సెబ్ సీఐ జయరాంనాయుడు మాట్లాడుతూ పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో తనిఖీలు చేపట్టి మహమ్మద్ షఫివుల్లా, గద్వాల షమివుల్లా వద్ద ఐదు బాక్సుల్లోని 480 (90ఎంఎల్) ఒరిజినల్ చాయిస్ విస్కీ టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన మద్యం విలువ రూ.30 వేలు ఉంటుందని సీఐ తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. సీఐతో పాటు సెబ్ ఎస్ఐ సోమశేఖర్‌రావు, హెచ్‌సీ గోపాల్, లింగప్రసాద్, రబ్బానీ, పీసీలు రామచంద్రుడు, నరసింహారెడ్డి, ఇందుమతి తదితరులు ఉన్నారు.

కుల గణన పకడ్బందీగా చేపట్టాలి

నందవరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కుల గణన సర్వే పకడ్బందీగా చేపట్టాలని తహసీల్దార్ నిత్యానందరాజు, ఎంపీడీఓ దశరథరామయ్య ఆదేశించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో కుల గణనపై సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. డిసెంబరు 10 నుంచి అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో సర్వే ప్రారంభమవుతుందన్నారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు సర్వేను పక్కాగా నిర్వహించాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని, వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. ఈఓపీఆర్డీ ఈశ్వరయ్య, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మహా రుద్రయజ్ఞం



వెల్దుర్తిలో కొనసాగుతున్న మహారుద్ర యజ్ఞం

వెల్దుర్తి(కృష్ణగిరి): పట్టణంలోని రాజరాజేశ్వర స్వామి (పసువుల) దేవాలయంలో గురువారం మహారుద్ర యజ్ఞ, హోమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వ్యాపారవేత్త ప్రశాంత్‌కుమార్ నిర్వహణలో వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య లక్ష్మీగణపతి, రుద్ర, సుదర్శన, ఆదిత్య, నవగ్రహ, కాలభైరవ హోమాలు, మహా పూర్ణాహుతి కార్యక్రమాలు జరిగాయి. పరమేశ్వరుని ప్రీతిపాత్రమైన కార్తీకమాసాన ఆయన కరుణకటాక్షాలతో యజ్ఞంలో పాల్గొన్న 100 మంది దంపతులు, వారి కుటుంబాలు, భక్తులందరికీ శుభం చేకూరాలన్న ఆకాంక్షను నిర్వాహకులు వ్యక్తం చేశారు.

నేడు కార్యాలయాల ప్రారంభోత్సవం

ఆస్పరి: మండలంలోని కారుమంచి గ్రామంలో కొత్తగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, రూ.10 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించేందుకు శుక్రవారం కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం గ్రామానికి వస్తున్నట్లు సర్పంచ్ లక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు చంద్రకళ తెలిపారు. అలాగే మంత్రి ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తారని, స్థానిక సమస్యలను తెలుసుకుంటారని చెప్పారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలన్నారు.